పడకేసిన పారిశుద్ధ్యం

పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేక పోవడతో దోమలతో పల్లె జనం నానా అవస్థ లుపడుతున్నారు. వానొస్తే కాలనీల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి మురుగు కుంటలుగా మారుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వారం రోజులుగా చెత్త సేకరణ జరగడం లేదని ఆరో పిస్తున్నారు. వానాకాలంలో దోమల వ్యాప్తితో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ బారినపడే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

- నిధులు లేక పనులు చేయించలేకపోతున్న ప్రత్యేక అధికారులు
- అద్దెకు సామగ్రి కొనుగోలు చేసినా మైనర్ రిపేర్లు
- బిల్లులు రాకపోవడంతో అరువు ఖాతాలు బంద్
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం



బంజేరుపల్లిలో ఇంటి ముందు నిలిచిన మురుగు నీరు

హుస్నాబాద్ రూరల్: జనవరితో గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌ల పాలన ముగియడంతో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించి పాలన కొనసాగిస్తోంది. సాధారణ ఎన్నికల రావడంతో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఆయా గ్రామాలకు ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకున్నవారు పాలనపై దృష్టిసారించడం లేదు. జనవరి నుంచి గ్రామ పంచాయతీలకు రావల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. హుస్నాబాద్ డివిజన్‌లో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో 49 గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో వీధులన్నీ అపరిశుభ్రంగా మారి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. వానాకాలంలో డెంగీ, సీజనల్ వ్యాధుల బారినపడితే అనారోగ్యానికి గురవుతామని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో పనులు చేయించలేని ప్రత్యేక అధికారులు కొందరు గ్రామాల వైపు కూడా చూడటం లేదు. గ్రామాల్లో అధికారిక కార్యక్రమాలు జరిగితే తప్ప గ్రామాలకు వెళ్లడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. బంజేరుపల్లి లాంటి చిన్న గ్రామాల్లో చెత్త బండి కదలడంలేదు. పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వక పోవడంతో వారు పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. జిల్లా అధికారులు స్పందించి పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేయించి స్వచ్ఛ గ్రామాలుగా చేయాలని కోరుతున్నారు.

మా ఇంటి ముందే మురుగు



మా ఊరులో కాల్వలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇంటి ముందు నిలబలేని పరిస్థితి. రోడ్డు మీద ఊడ్చిన చెత్త కూడా తీయడం లేదు. వారానికి ఒకసారి ట్రాక్టర్ వస్తుంది. అది ఎక్కడ ఆగుతుందో తెలియదు. ప్రత్యేక అధికారి, కార్యదర్శి గ్రామానికి వచ్చి పారిశుద్ధ్య పనులు చేయించాలి.

– స్వామి, బంజేరుపల్లి

గ్రామాల్లో స్వచ్ఛత పనులు



వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం. ఎప్పటిలాగే ఇంటింటికి చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. పంచాయతీల్లో నిధులు లేకపోతే పంచాయతీ కార్యదర్శులే పెట్టుబడులు పెడుతున్నారు. పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని జిల్లా అధికారులకు నివేదిక అందజేశాం. ఎప్పుడూ వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో పనులు కార్యదర్శులు పనులు చేయించేందుకు ఇబ్బంది పడుతున్నారు.

– వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ, హుస్నాబాద్

మొలకెత్తని విత్తనాలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలో మొలకెత్తని వరి విత్తనాలు.. ఆందోళనలో అన్నదాతలు అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. గురువారం ఏఓ నాగరాజు, ఏఈఓ సింధూజ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. మొలకెత్తని వరి విత్తనాల గురించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వరి విత్తనాలు మొలకెత్తలేదన్నారు. దీంతో కంపెనీ వారితో మాట్లాడి మొలకెత్తని విత్తనాల స్థానంలో మరో విత్తనాలను రైతులకు ఇప్పించామన్నారు.



మొలకెత్తని వరి విత్తనాలపై విచారణ చేస్తున్న ఏఓ నాగరాజు

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొన్నిసార్లు వాతావరణంలో మార్పుల వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతాయన్నారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

- పెండింగ్ కేసులపై సీపీ సమీక్ష



ప్రశంసా పత్రం అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: మహిళల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. పెండింగ్ కేసులపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికలు ఇన్సిడెంట్ ఫ్రీ గా నిర్వహించినందుకు పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మత్తుపదార్థాలు, పేకాట, జూదంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కుపాదంతో అణిచివేయాలన్నారు. గంజాయి రహిత జిల్లా కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతీ అధికారి నిజాయితీగా విధులు నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను ఆధునిక సాంకేతిక సాయంతో అన్ని కోణాల్లో పరిశోధన చేసి ఛేదించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో అద్భుతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. నేరాలు జరగకుండా ప్రోయాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ మధు, ఏసీపీలు పురుషోత్తంరెడ్డి, సతీష్, శ్రీనివాస్, రవీందర్, సుమన్‌కుమార్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీఐలు విద్యాసాగర్, లక్ష్మీబాబు, ఉపేందర్, శ్రీను, రామకృష్ణ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల కండిషన్ చెక్ చేయాలి

- రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ధరణికుమార్

సిద్దిపేటకమాన్: పోలీసు వాహనాల కండిషన్‌ను ప్రతీరోజూ తనిఖీ చేసి వాహనాలను నడపాలని సిబ్బందికి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ధరణికుమార్ సూచించారు. పోలీసు అధికారుల వాహనాలను సీపీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏఆర్ హెడ్‌క్వార్టర్ మెకానిక్‌తో వాహనాల ఫిట్‌నెస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలలో వాటర్, ఆయిల్, బ్యాటరీని గమనించాలన్నారు. డ్రైవర్లు సైరెన్లు ఎక్కడ పడితే అక్కడ వేయకూడదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపకూడదన్నారు. వాహనాలలో అమర్చిన రాపిడ్ కాప్ టెక్నాలజీ పనితీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్కరూ సీటు బెల్ట్ ధరించి, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు.



వాహనాన్ని పరిశీలిస్తున్న మెకానిక్

బలవంతంగా ఖాళీ చేయించడం తగదు

- మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



సీల్ చూపుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): డబుల్ బెడ్రూం ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించడం ప్రభుత్వానికి తగదని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని ఖమ్మంపల్లిలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన 60 డబుల్ బెడ్రూం ఇళ్లను అప్పట్లో 41 మందికి కేటాయించగా మిగతా 19 మంది లబ్ధిదారుల ఎంపికకు ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా పడింది. ఈ క్రమంలో 19 డబుల్ బెడ్రూం ఇళ్లలో పేదలు తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. అయితే రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఇటీవల బలవంతంగా ఖాళీ చేయించి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రతాప్‌రెడ్డి గురువారం డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. జరిగిన విషయాన్ని ఆయనకు చెబుతూ బాధితులు బోరున విలపించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలంటూ వేడుకున్నారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్లలో ఉంటున్నవారు అర్హులా, అనర్హులా అని చూడకుండా ఉన్నట్టుండి ఖాళీ చేయించడం దారుణమన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నూనె కుమార్, ర్యాగల్ల దుర్గయ్య, జీర రాజు, అహ్మద్, దున్న సాయిలు, మల్లేశం, కనకయ్య, శ్రీశైలం, యాదగిరి పాల్గొన్నారు.

స్తంభాన్ని తొలగించండి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని రాయవరం ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా మరమ్మతు పనులు చేస్తున్నారు. నూతనంగా వంట గది నిర్మాణ స్థలంలో విద్యుత్ స్తంభం అడ్డుగా ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. దానిని తొలగించాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని కాంట్రాక్టర్, ఉపాధ్యాయులు తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

చేర్యాల(సిద్దిపేట): బీఆర్‌ఎస్ పార్టీ టౌన్ సెక్రటరీ బూరగోని తిరుపతిగౌడ్ తండ్రి యాదగిరి ఇటీవల మృతి చెందాడు. గురువారం పట్టణ కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తిరుపతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే మండలంలోని ముస్త్యాలకి చెందిన మెరిండ్ల శ్రీనివాస్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ కరుణాకర్, కౌన్సిలర్ చంటి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భగీరథ సర్వే పూర్తి చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): మిషన్ భగీరథ సర్వే పూర్తి చేయాలని మద్దూరు ఎంపీడీఓ రామ్మోహన్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని సలాక్‌పూర్, మరుమాముల, ధర్మారం గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించారు. అనంతరం గ్రామాల్లో కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వేను పరిశీలించారు. సర్వే శనివారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

గజ్వేల్‌రూరల్: ప్రజలు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి పేర్కొన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని భరత్‌నగర్‌లో పర్యటించి ప్రజలకు పారిశుద్ధ్యంపై పలు సూచనలు చేశారు.

సమాజాన్ని మార్చేది ఉపాధ్యాయులే

- ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): సమాజాన్ని మార్చే శక్తి సామర్థ్యాలు ఉపాధ్యాయులకు మాత్రమే ఉన్నాయని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని పెద్దకోడూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కస్తూరి రాజలింగారెడ్డి ఉద్యోగ విరమణ సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను శక్తివంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అనిర్వచనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, ఎంఈఓ యాదవరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నరేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన రాజలింగారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు.



రాజలింగారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

దరఖాస్తు చేసుకోండి



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్ గరల్స్ హాస్టల్‌లో సహాయ వంట మనుషుల పోస్టులు ఖాళీగా ఉన్నాయిన కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత గురువారం తెలిపారు. రెండు పోస్టులకు వేర్వేరుగా దరఖాస్తు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే వారు 7వ తరగతి పాసై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తుతో పాటు ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, 7వ తరగతి పాసైన సర్టిఫికెట్ జతచేసి ఈనెల 28 నుంచి జూలై 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చినుకు జాడలేక.. నీటి తడులు లేక



ఆకాశం వైపు చూస్తున్న రైతు

వరుణుడు మొఖం చాటేయడంతో రైతులు వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. రోహిణీ కార్తెలో వానలు జోరుగా కురియడంవల్ల గ్రామాల్లో రైతులు ముందుగానే పత్తి పంట సాగు చేపట్టారు. పత్తి మొలక దశలో చినుకు లేకపోవడంతో పంట నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సుమారు 8 వేల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జగదేవ్‌పూర్(గజ్వేల్):

విద్యార్థినులకు హాస్టల్ వసతి

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని సంగాపూర్ మార్గంలో గల బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని కళాశాలలో డిగ్రీలో చేరే విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పిస్తామని గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో గజ్వేల్ బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని బాలుర డిగ్రీ కళాశాలలో కో ఎడ్యుకేషన్‌ను పునః ప్రారంభించామన్నారు. దోస్త్ ద్వారా గజ్వేల్ డిగ్రీ కళాశాల 16019 కోడ్‌తో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్ సదుపాయం ఉందన్నారు.

షరతులు విధిస్తే ఉద్యమిస్తాం

నంగునూరు(సిద్దిపేట): రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వం షరతులు విధిస్తే రైతులతో కలిసి ఉద్యమిస్తామని భారతీయ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి హెచ్చరించారు. గురువారం కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం నంగునూరులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యానికి మద్దతు ధర రూ.500 చెల్లిస్తామని చెప్పి సన్నరకానికే ఇస్తామని మాట మార్చారన్నారు. అలాగే రైతుబంధు ఇవ్వలేదని, ప్రతీ రైతుకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి కొర్రీలు పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని వినతి



ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌తో మాట్లాడుతున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని గురువారం మంగోల్ మాజీ ఎంపీటీసీ భర్త, కాంగ్రెస్ నాయకుడు ఎల్లు శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కుకునూరుపల్లి మండలం నూతనంగా ఏర్పడిందని ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలతో పాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. స్పందించిన నరేందర్ నిధులు మంజూర్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హుస్నాబాద్: ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసీఈయూ) హుస్నాబాద్ శాఖ 29వ వార్షిక సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి కరీంనగర్ డివిజన్ ఉపాధ్యక్షుడుగా రామ్మోహన్ రావు, ప్రధానకార్యదర్శి వామన్‌రావు హాజరయ్యారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హుస్నాబాద్ శాఖ అధ్యక్షుడిగా పెద్ది సదాశివరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.ప్రేమ్ కుమార్, కార్యదర్శిగా రాజేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా వి. కరుణాకర్, వి.వెంకట్రాజ్యం, కోశాధికారిగా ఎం.వివేక్ ఎన్నికయ్యారు.

చెత్త వేరుచేసే విధానంపై అవగాహన

హుస్నాబాద్: పట్టణంలోని 15 వార్డులో స్వచ్ఛ సర్వేక్షన్ 2024–25 కార్యక్రమంలో భాగంగా యూబీఆర్– బాసిల్ ఫౌండేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో గురువారం తడి, పొడి, హానికర చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వార్డులోని ప్రతీ ఇంటికి తిరిగి చెత్తను గ్రీన్ రంగు డబ్బాలో తడి చెత్త, బ్లూ రంగు డబ్బాలో పొడి చెత్త వేయాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే జరిమానా విధిస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ, గణితం, కంప్యూటర్ సబ్జెక్టులు బోధించేందుకు అతిథి అధ్యాపకుల పోస్ట్ కోసం ఎస్ఈటీ, ఎస్ఈటీ, పీహెచ్‌డీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి గురువారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఓసీ, బీసీలకు 55 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు డిగ్రీ కళాశాల కార్యాలయంలో జులై 1వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. అర్హత గల అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

నంగునూరు(సిద్దిపేట): కొండంరాజ్‌పల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు ఏడీఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కారణంగా మండలంలోని గట్లమల్యాల, ఖాత, ఘణపూర్, కొండంరాజ్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన పుట్ట చందు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం చేయించుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇటీవల దరఖాస్తు చేశాడు. ప్రభుత్వం స్పందించి రూ.లక్ష విలువవైన ఎల్‌ఓసీ విడుదల చేసింది. ఈ పత్రాలను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గురువారం అతడికి అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నంట బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి శిక్షణా తరగతులు

కొమురవెల్లి(సిద్దిపేట): జూలై 1 నుంచి మండల కేంద్రంలో సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని పార్టీ జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సీపీఎం ప్రజాసమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు రవీందర్ రెడ్డి, అరుణ్, శారద, మల్లేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట కమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 11 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు.

సంక్షిప్త వార్తలు

◆ **పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ**

కొండపాక(గజ్వేల్): కొండపాక పంచాయతీ కార్యదర్శి స్వప్నకు గురువారం మెమో జారీ చేసినట్లు ఎంపీఓ వీరరాజు తెలిపారు. కొండపాక గ్రామ పంచాయతీ అవసరాల కోసం వినియోగించాల్సిన ట్రాక్టరుతో ప్రైవేటు వెంచర్‌కు నీటిని సరఫరా చేశారు. ఈ విషయంపై వార్తా కథనాలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. స్పందించిన ఎంపీఓ పంచాయతీ కార్యదర్శికి మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ మెమో జారీ చేశారు.

◆ **సివిల్ రైట్స్ డే నిర్వహించాలి**

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లోని దళిత వాడల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ గురువారం అన్నారు. గ్రామంలోని దళిత వాడల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముందస్తుగా రెవెన్యూ, పోలీసు, అన్ని శాఖల అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. దళితులపై జరుగుతున్న దాడులు, భూముల ఆక్రమణ, ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి సహపంక్తి భోజనం చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనని అధికారులపై చర్యలు తీసుకునేలా జిల్లా అధికార యంత్రాంగం చొరవ చూపాలన్నారు.

◆ **మృతుల కుటుంబాలకు పరామర్శ**

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో గుండెపోటుతో మృతి చెందిన రైతు కొంక ప్రభాకర్, విశ్వనాథపల్లిలో మృతి చెందిన గొడుగు చంద్రం కుటుంబాలను గురువారం మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ర్యాగల్ల దుర్గయ్య, చిలుముల రాంమ్మోహన్, దోమల ఎల్లం, అహ్మద్, కోడెల మల్లేశం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు వర్గల్ తైబజార్ వేలం**

వర్గల్(గజ్వేల్): వర్గల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను శుక్రవారం తైబజార్ బహిరంగ వేలం పాట జరుగుతుందని ప్రత్యేకాధికారి పవన్‌కుమార్ తెలిపారు. వేలం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, ఆసక్తి గలవారు పాల్గొనవచ్చన్నారు.

◆ **చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

సిద్దిపేటకమాన్: పార్లమెంట్‌లో అసదుద్దీన్ ఓవైసీ ప్రమాణ స్వీకార సందర్భంగా చేసిన మాటలు దేశ సమగ్రత, ఐక్యతను దెబ్బతీసే విధంగా ఉందని సిద్దిపేట జిల్లా హిందూ వాహిని నాయకులు సీపీ అనురాధకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఓవైసీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వేణుగోపాల్, శ్రీకాంత్, శంకర్, రాజేశం పాల్గొన్నారు.

◆ **రాజకీయ ఉనికి కోసమే ఆరోపణలు**

చేర్యాల(సిద్దిపేట): కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై సీపీఎం, ఏఐఎఫ్‌బీ నాయకులు చేస్తున్న ఆరోపణలు అసత్యమని, కేవలం వారి రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసమే చేస్తున్నారని యూత్ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. గురువారం పట్టణ కేంద్రంలో పలువురు మాట్లాడారు. నాడు ముత్తిరెడ్డి కబ్జా చేసిన చెరువు మత్తడి స్థలం కోసం జరిగిన పోరాటంలో ముందు నిలిచిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై కబ్జా ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడుతున్న నాయకుడికి మద్దతు ఇవ్వకుండా అనవసరంగా విమర్శలు చేస్తే రాజకీయంగా కనుమరుగవడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో యూత్‌నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **వేలం ఆదాయం రూ.4.91 లక్షలు**

కోహెడ(హుస్నాబాద్): ఏడాది కాలానికి వారాంతపు సంతకు గురువారం కోహెడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి భూక్య దేవేందర్ రాథోడ్ తెలిపారు. రూ.4.91 లక్షలకు సముద్రాలకు చెందిన ఉప్పుల వెంకట్ కైవసం చేసుకున్నారు. అలాగే కొత్త బస్టాండ్ వద్ద ఉన్న మూడు పాత షెట్టర్లకు నిర్వహించిన వేలంకు ఎవరూ రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి తెలిపారు. త్వరలో మూడు షెట్టర్లకు బహిరంగ వేలం వేసే తేదీ ప్రకటిస్తామన్నారు.

◆ **వైభవంగా శివపార్వతుల కల్యాణం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని పారుపల్లి శివాలయ 34వ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

◆ **నోట్‌బుక్స్ పంపిణీ**

తొగుట(దుబ్బాక): మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు సిలివేరి మల్లారెడ్డి నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.